క్లుప్తంగా

రైతుల సమస్యలపై సామూహిక రాయబారం

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు భూ బాధిత రైతుల సమస్యలపై ఈ నెల 9వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే సామూహిక రాయబారానికి రైతులు తరలిరావాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణతో కలిసి శుక్రవారం ఆయన తెనాలి మండలం గుడివాడ, కొలకలూరు గ్రామాల్లో పర్యటించారు. భూములు కోల్పోనున్న రైతులను కలిసి మాట్లాడారు. మార్కెట్ రేటు ప్రకారం నష్ట పరిహారం అందకపోతే తాము నష్టపోతామని ఈ సందర్భంగా రైతులు చెప్పారు. ఇంతవరకు తమ భూములు తీసుకుంటున్నట్లు నోటీస్ ఇవ్వలేదని తమకు నష్టపరిహారం ఎంత ఇస్తారన్నది స్పష్టత లేదని చెప్పారు. ఉన్న కొద్దిపాటి భూమి కోల్పోతే తమ కుటుంబాల జీవనాధారం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండి సుధాకర్, జ్యోతుల కోటేశ్వరరావు, గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

తెనాలిరూరల్: మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామంలో గల శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గంథాలయ సంస్థ చైర్మన్ భీమినేని వందనాదేవి, కార్యదర్శి వంకధార సుబ్బరత్నమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం విషయమై దాతలు వీరమాచనేని వెంకటేశ్వరరావు, కొత్త రమేష్‌బాబులతో మాట్లాడారు. భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు త్వరలో వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వీరి వెంట గ్రంథాలయాధికారి ఎ. శివకుమార్ ఉన్నారు.

బాధితులను ఆదుకునేందుకు రక్తదానం

నిజాంపట్నం: అమ్మ భగవాన్ పుట్టినరోజు సందర్భంగా ఆమె శిష్యులు మొగదారయ్య, నిజాంపట్నం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నిజాంపట్నంలోని అన్నపూర్ణ నిలయంలో శుక్రవారం రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో రేపల్లె రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారితో 26 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఈ రక్తాన్ని ఉపయోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి వసంతం వీరరాఘవయ్య, నాయకులు బొమ్మిడి రామకృష్ణ, నిజాంపట్నం రెడ్ క్రాస్ చైర్మన్ గౌరీ శంకర్, జాయింట్ సెక్రెటరీ బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కలిగిఉండాలి

జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సోమ్లానాయక్

బాపట్ల టౌన్: హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సోమ్లానాయక్ తెలిపారు. మండలంలోని అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రికార్డులు తనిఖీ చేశారు. డాక్టర్ సోమ్లానాయక్ మాట్లాడుతూ.. ఎస్‌సీడీసీడీ, ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్, యూపీఐ, క్యాన్సర్‌కు సంబంధించిన హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉస్మాన్, సూపర్‌వైజర్‌లు రత్నశేఖర్, దుర్గమ్మ, ఫార్మసిస్ట్‌లు శ్రీవల్లి, స్టాఫ్ నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ పూజ

కోనేటిపురం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురంలో శుక్రవారం అమ్మ వైష్ణవీ రామకృష్ణ ధామం ఆవరణలో శుక్రవారం సరస్వతీ పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అమ్మసేవా ఆంధ్రా విభాగం కన్వీనర్ పరచి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలను జరిపారు. శ్రీ వైష్ణవీ పీఠాధిపతులు, అఖండ తేజో మూర్తి దైవ స్వరూపులు శ్రీ పద్మజా సమేత అమ్మ వైష్ణవీ రామకృష్ణతో జ్ఞాన సముపార్జన కోసం విద్యార్థులకు బీజాక్షరాలు రాయించామని పేర్కొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడుని భర్తరఫ్ చేయాలి

తెనాలిలో దిష్టిబొమ్మ దహనం చేసిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నేతలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మార్కెట్ సెంటర్లో మంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

తెనాలి: శాసనమండలిలో ఈనెల నాలుగో తేదీన టీడీపీ మంత్రి అచ్చెన్నాయుడు మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గం ఎస్సీ సెల్ తీవ్రంగా ఖండించింది. అచ్చెన్నాయుడుని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఎస్సీ సెల్ నాయకులు కరెవరపు దేవానంద్, కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శాసనమండలిలో అచ్చెన్నాయుడు మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించటానికి నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి అచ్చెన్నాయుడు దిష్టిబొమ్మను మార్కెట్‌సెంటర్లో దహనం చేశారు. తొలుత పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని గౌరవించాల్సిందిపోయే ఆయనను లక్ష్యంగా చేసుకొని కులం, మతం పేరుతో కూటమి నాయకులు మండలిలో వ్యవహరించిన తీరు, చట్టసభల సంస్కృతికి విరుద్ధమన్నారు. మండలి చైర్మన్ మోషేన్ రాజు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మంత్రి కుల పరంగా, మత పరంగా విమర్శలు గుప్పించారని ధ్వజమెత్తారు. చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తికి కులమతాలను ఆపాదించడం దుర్మార్గమన్నారు. ఎస్సీ హిందూ వర్గానికి చెందిన మోషేన్‌రాజు, 'నేను హిందువునే...మీరు నా కులం గురించి ఎందుకు మాట్లాడతారు' అంటూ నిలదీయాల్సిన అవసరం వచ్చిందని గుర్తుచేశారు. దళిత వర్గానికి చెందిన మోషేన్‌రాజుకు శాసనమండలి చైర్మన్ పదవినిచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో గౌరవించారని తెలిపారు. మోషేన్ రాజును వివిధ రకాలుగా అవమానించారని ఆరోపించారు. ప్రోటోకాల్ విషయంలో తిరుపతిలో జరిగిన మహిళా పార్లమెంట్‌లో, ఏలూరు జిల్లాలో అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాల్లో శిలాఫలకాల్లో పేరు వేయలేదన్నారు. మోషేన్‌రాజు ఒక దళితుడనా లేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో చైర్మన్ అయ్యారనా? అతన్ని మానసిక క్షోభకు గురి చేస్తున్నారని ప్రశ్నించారు. వీటన్నిటికీ కూటమి నాయకులు సమాధానం చెప్పాల్సిన రోజు తప్పకుండా వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉన్నం హనీష్, బండ్లమూడి నాని, పిన పాటి రవికిరణ్, గొరికపూడి బాలరాజు, అత్తోట అమృతరాజు, తుల్లిమిల్లి సువర్ణబాబు, పిల్లి గంగాధర్, మండ్రు రాజు, నాలాది బుజ్జిబాబు, దర్శి రవి తేజ, కాకి దేవసహాయం, సంకురు అనివాష్, బడుగు కాటయ్య, వంపుగళ్ల కృష్ణ, పల్లె రోహిత్ శామ్యూల్, హోసన్నా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసు

తెనాలిరూరల్: శాసనమండలిలో స్పీకర్ మోషేన్‌రాజుపై మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్ సీపీ నాయకులు మంత్రి దిష్టిబొమ్మను మార్కెట సెంటరులోని అన్న క్యాంటీన్ వద్ద శుక్రవారం దహనం చేశారు. ఈ ఘటనపై ఐటీడీపీ కార్యికర్త మల్లవరపు విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అక్కిదాసు కిరణ్‌కుమార్ మరో నలుగురిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు వాకర్స్ క్లబ్ సమావేశం

తెనాలి: వాకర్స్ క్లబ్ సమావేశం ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు స్థానిక కవిరాజు పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఊపిరితిత్తుల నిపుణులు, యడ్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర శ్రీనిధి దివి, 'వృద్ధుల్లో ఊపిరితిత్తుల మార్పులు- శ్వాసకోశ వ్యాధులు- నివారణ' అంశంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి ముందు క్లబ్ సభ్యులకు ఉచితంగా ర్యాండమ్ షుగర్, బీపీ పరీక్షలు చేస్తారన్నారు. సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

దోమల నిర్మూలనతోనే ప్రజారోగ్యం

కొల్లిపర: దోమల నిర్మూలనతోనే ప్రజలు ఆర్యోగవంతులుగా జీవిస్తారని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ప్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామాల్లో దోమల నివారణ కోసం ప్రజలు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా, పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నప్పుడే దోమలను నిరోధించడం సాధ్యమవుతుందని చెప్పారు. ఈ వైద్యాధికారి గంటా నేహా, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

తెనాలి: మహిళలు అంతర్గతంగా సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పక పరీక్షలు చేయించుకుంటూ వ్యాధి బారినపడితే తగిన మందులు వాడాలని పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద అన్నారు. ఏపీ పైలట్ కమ్యూనిటీ హెల్త్ ప్రాజెక్టులో భాగంగా స్థానిక డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్ సహా వివిధ రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తూ మందులను కూడా అందజేస్తున్నారు. ఈ క్రమంలో సొసైటీ దత్తత తీసుకున్న రూరల్ మండలం నందివెలుగులోని కల్యాణ మండపంలో గత వారం రోజులుగా సాయంత్రం మహిళల వ్యాధులకు సంబంధించిన మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వ్యాధుల నిర్ధారణకు అవసరమైన రక్తపరీక్షలు, స్క్రీనింగ్, ఆల్ట్రాసౌండ్ పరీక్షలను సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద చేశారు. మొత్తం 188 మంది మహిళలకు పూర్తిస్థాయిలో పరీక్షలు చేయగా 38 మందికి కొత్తగా వ్యాధులున్నట్టు గుర్తించారు.

మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శారద, సర్పంచ్ పవన్‌కుమార్

ఆయా పరీక్షల నివేదికలను శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్, కార్యదర్శి హేమకుమారి చేతులమీదుగా రోగులకు అందజేశారు. సొసైటీ తరపున డాక్టర్ డి.శారద రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మందస్తు పరీక్షలు తప్పనిసరిగా చెప్పారు.

ఆధునిక ఫార్మసీలో పెరుగుతున్న ఏఐ ప్రాధాన్యత

తెనాలి: ఆధునిక ఫార్మశ్రీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాత్ర రోజురోజుకు పెరుగుతోందని ప్రొఫెసర్ డాక్టర్ షేక్ అబ్దుల్ రెహ్మాన్ చెప్పారు. ఔషధాల పరిశోధన, రోగ నిర్ధారణ, ఔషధాల అభివృద్ధి వంటి అనేక రంగాల్లో ఏఐ సాంకేతికత వినియోగం ఫార్మసీ విద్యార్థులకు కొత్త అవకాశాలను తీసుకొస్తుందని చెప్పారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏ.ఎస్.ఎన్.ఫార్మసీ కాలేజిలో మార్చి 6న జాతీయ ఫార్మశీ విద్యా దినోత్సవం సందర్భంగా ఫార్మా అన్వేషణ నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ డాక్టర్ షేక్ అబ్దుల్ రెహ్మాన్ విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. భవిష్యత్ ఫార్మసిస్టులు ఆవిష్కరణాత్మక దృక్పథం, నైతిక విలువలు, సేవా భావంతో ముందుకు సాగాలని సూచించారు. కాలేజి కరస్పాండెంట్, సెక్రటరీ అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరి మాట్లాడుతూ జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ అభినందనీయమని చెప్పారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ భారతదేశంలో ఫార్మసీ విద్యకు పునాది వేసిన ప్రొఫెసర్ మహాదేవ్ లాల్ శ్రాఫ్ జయంతి రోజున ఏటా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారని చెప్పారు.

ప్రొఫెసర్ అబ్దుల్ రెహ్మాన్‌కు సత్కారం చేస్తున్న దృశ్యం

ఈ సంవత్సరం కార్యక్రమాన్ని 'ఎంపవరింగ్ నెక్స్ట్ జనరేషన్ ఫార్మసిస్ట్స్: ఇన్నోవేషన్, ఇంటెగ్రిటీ అండ్ ఇన్‌స్పిరేషన్' అనే థీమ్‌తో నిర్వహించినట్టు తెలిపారు. దేశంలో ఫార్మసీ విద్యను ప్రోత్సహించి, ఫార్మసిస్టుల ప్రాధాన్యతను ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. ఫార్మా అన్వేషణ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు కొత్త ఆవిష్కరణలకు దారితీస్తాయని తెలిపారు. కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్. 1, 2 ప్రోగ్రామ్ ఆఫీసర్లు కె. కళ్యాణ్ చక్రవర్తి, జి. నందగోపాలకృష్ణ, ఐపీఏ-ఎస్ఎఫ్ ఏఎస్ఎన్ చాప్టర్ మెంటార్ పి.భార్గవి పర్యవేక్షించారు.

విద్యతోనే మహిళలకు సమాజంలో గుర్తింపు

తెనాలిఅర్బన్: మహిళల హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది మద్దుర్తి స్వాతి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం జేఎంజే కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించిదని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ శాంతకుమారి మాట్లాడుతూ మహిళా విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్య ద్వారా సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఉమెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ చిలువూరి సరోజిని మాట్లాడుతూ మహిళలు గతంలో వంట ఇంటికే పరిమితమయ్యేవారని గుర్తు చేశారు. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామమని పేర్కొన్నారు. అనంతరం వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కార్యదర్శి సింధు, కమిటీ సభ్యులు యోజిత, ఏస్తేరు, స్రవంతి, పలువురు అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధ్యాపకురాలు సరోజిని

తండ్రిని వేధిస్తున్న కుమారుడిపై కేసు

తెనాలిరూరల్: తండ్రికి ఉన్న పొలాన్ని లాక్కుని ఆయన ఆలనా పాలనా చూడకుండా వేధిస్తున్న కుమారుడిపై కేసు నమోదైంది. పెదరావూరు గ్రామానికి చెందిన 85 ఏళ్ల దావులూరి శివరామప్రసాద్‌కు ముగ్గురు కుమారులు. ఒక కొడుకు గతంలో మృతి చెందగా, మరో కొడుకు పొన్నూరులో ఉంటున్నాడు. ఇంకో కొడుకు చక్రపాణి తన తండ్రికి చెందిన 3.18 ఎకరాల పొలం లాక్కుని పట్టించుకోవడం మానేశాడు. దీనిపై బాధిత వృద్ధుడు డివిజనల్ మేజిస్ట్రేట్ కోర్టు (సబ్ కలెక్టర్ కార్యాలయం)లో ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారుల విచారణలో ఫిర్యాదు వాస్తవమేనని తేలింది. డివిజనల్ మేజిస్ట్రేట్ కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కుమారుడిపై సీనియర్ సిటిజన్స్ యాక్టు కింద కేసు నమోదుచేశామని ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు.

జనరిక్ మందులను ఉపయోగించండి

తెనాలిఅర్బన్: జనరిక్ మందులను ఉపయోగించడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఏపీ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ దివ్వెల మధుబాబు తెలిపారు. జన ఔషధి దివాస్‌ను పురస్కరించుకుని లక్ష్మి థియేటర్ రోడ్డులోని ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి జనరిక్ మందుల షాపు నుంచి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తక్కువ ధరకు లభిచండంతో పాటు, ఇంగ్లీషు మెడిసిన్ కంటే ఇది సమర్థవంతంగా పనిచేస్తుందని చెప్పారు. అవసరమైన వారు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తన్నీరు శివశంకర్, దివ్వెల వెంకయ్య, పెద్దిశెట్టి గంగయ్య, ముద్దాబత్తుని సాంబశివరావు, జనరిక్ మందుల షాపు నిర్వాహకులు దివ్వెల ఏడుకొండలు, హరికృష్ణ, రాజేష్, గుప్తా ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మధుబాబు, శివశంకర్, తదితరులు

జనగణన ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలి

తెనాలిరూరల్: మే 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన-2027 కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జనగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమాన్ని తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో తహసీల్దార్ గోపాలకృష్ణ సమావేశమయ్యారు. మే నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సంబంధిత అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు, విధానాలు అలాగే సమన్వయంపై మార్గదర్శకాలు చేసినట్లు చెప్పారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన జనగణన కార్యక్రమంపై అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. జనగణన కార్యక్రమాన్ని పారదర్శకంగా 100 శాతం కచ్చితత్వంతో నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

14న మెగా లోక్ అదాలత్

కొల్లిపర: ఈ నెల 14వ తేదీన తెనాలి రెండవ అదనపు సివిల్ జడ్జి కోర్టులో మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మండలంలోని యాక్సిడెంట్, కొట్లాట, చీటింగ్, చిట్‌ఫండ్ , భూ తగాదాలు వంటి కేసులు ఉన్న వారు ఇరు వర్గాలు రాజీ చేయించుకోవాలని భావిస్తే వెంటనే వారి పేర్లు 12వ తేదీ లోగా కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎటువంటి వివాదాలు అయిన ఈ జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో ఇరు వర్గాలు వారు ఒక మాట మీద ఉంది వస్తే రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. కేసులను వెంటనే క్లోజ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మంత్రి లోకేష్ కార్మికుల హామీని అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు గత 458 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని వివరించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో స్పందన రాలేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ ప్రకారం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ సమస్యపై పోరాడడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గురవయ్య, సుభాని, సాంబశివరావు, ఇమాంబి, విజయశ్రీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు కవి నూతక్కి అబ్రహాం జయంతి

తెనాలిటౌన్: కవి నూతక్కి అబ్రహాం 103వ జయంతిని శనివారం రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు అభిమానులు ఘనంగా నిర్వహించనున్నారు. కవి కోకిల జాషువా ప్రియశిష్యుడైన మధురకవి నూతక్కి అబ్రహాం 1923 మార్చి 7వ తేదీన కొలకలూరు గ్రామంలో నూతక్కి దానియేల్, కాటమ్మ దంపతులకు జన్మించారు. గుంటూరు ఏసీ కళాశాలలో ఎఫ్ఏ విద్యను అభ్యసించి ఆయనకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. మరో వైపు సాహితీ సేవలో నిమగ్నమయ్యే కవిత్వం రాయాలనే అభిలాషను నేర వేర్చుకున్నారు. కవి జాషువా ప్రియశిష్యునిగా ప్రసిద్ధికెక్కారు. అబ్రహాం రాసిన కావ్యాల్లో మత్కుణం ప్రసిద్ధికెక్కింది. సమాజంలో జరుగుతున్న దోపిడీ వ్యవస్థను ప్రశ్నిస్తూ మత్కుణం కావ్య ఇతివృత్తాన్ని నాటి పత్రికలు ప్రశంసించాయి. ప్రజా చైతన్య భరితమైన పద్యకావ్యాలతో పరిశోధనాత్మక దృష్టితో ఆయన రాసిన కుల వ్యవస్థ వచన గ్రంథం అత్యంత ప్రాచుర్యం పొందింది. బాలమిత్ర, అక్షర జ్యోతి, కులవ్యవస్థ వంటి 25 పద్య గద్య పరిశోధన కావ్యాలు రాసి మధుర కవిగా, కావ్య కళానిధిగా, అభినవ జాషువాగా, సాహితీ ధ్రువ తారగా, కవి పండితుల మన్ననలు అందుకున్నారు. ఆయన జీవిత చరమాంకం వరకు తెలుగు భాషకు ఎనలేని సేవలు చేశారు.

కవి నూతక్కి అబ్రహాం

గౌరీ రామకుమారికి సత్కారం

రేపల్లె: డాక్టర్ సీవీ రామన్ అకాడమి వారితో విజయవాడలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన పొన్నూరు గౌరీ రామకుమారి వాసవీ సేవా మహిళా శిరోమణి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం పట్టణ వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆమెను సత్కరించి సేవా రంగంలో ఆమె చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాళేపల్లి ఈశ్వరబాబు, గౌరవాధ్యక్షుడు మట్టుపల్లి సుబ్బారావు, రైలుపేట రామకృష్ణ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు, వాసవీ మహిళా సంఘం అధ్యక్షురాలు కొత్త సత్యవతి, సభ్యులు కె.మల్లీశ్వరి, ఉషారాణి, ఇందిమతి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణం నిలిపివేయాలి

వేమూరు: చుండూరు శ్రీపాపవినాశస్వామి దేవాలయాన్ని పునః నిర్మాణం పేరుతో ఆలయ చారిత్రక విశిష్టతను దెబ్బతీసే విధంగా పలువురు యత్నిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. చుండూరు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గ్రామస్తులు మాట్లాడారు. 150 ఏళ్ల కిందట ఆలయాన్ని గ్రామస్తులు గాదె అప్పరెడ్డి పునః నిర్మించారని అన్నారు. కాగా మున్నంగివారిపాలెం గ్రామానికి చెందిన పలువురు కూటమి నాయకులు మరికొందరితో కలిసి గ్రామస్తులు, భక్తుల అభిప్రాయాలను స్వీకరించకుండా ఆలయాన్ని పునః నిర్మించాలని చూస్తున్నట్లు ఆరోపించారు. ఆలయంలో గుప్త నిధులు ఉన్నాయని.. దీంతో పునః నిర్మాణానికి నాయకులు ముందుకు వచ్చారని.. దేవాలయ శాఖ కార్యనిర్వహణాధికారి సైతం సహకరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సోమశేఖర్ రెడ్డి, ఈమని సాంబరెడ్డి, పి.ప్రసాద్‌రెడ్డి, గొరిపాటి వెంకటేశ్వర రెడ్డి, ఈమని వీరారెడ్డి, మోదుగుల రాజలక్ష్మి, గొరిపాటి ఈశ్వరమ్మ, మోదుగుల శాతం , తదితరులు పాల్గొన్నారు.

చుండూరులో ఆలయ పునర్నిర్మాణం నిలుపుదలపై మాట్లాడుతున్న గ్రామస్తులు

ఇండియన్ బ్యాంక్, తెనాలి బ్రాంచి,
బుర్రిపేలివారి స్ట్రీట్, మారీసుపేట, తెనాలి,
గుంటూరు జిల్లా-522202. ఎపి.